
# ఇది నాది!

— వేటూరి భారతి

అన్నపూర్ణకి భలే ఆనందంగా ఉంది. 'గాలి ఈలలు వేసేననీ, సైగ చేసేననీ ఈనాడే తెలిసింది' అని పాడుకుంది కూడానూ, ఎవరూ వినకుండా. వింటే తనకేమీ ఫరవాలేకపోయినా విన్నవాళ్ళే కొంచెం బాధపడతారని భయం. ఇల్లంతా కాలు గాలిన పిల్లిలా తిరుగుతోంది. మధ్యాహ్నం నుంచీ మాటిమాటికీ గడియారం చూస్తోంది. 'ఐదు ఎప్పుడవుతుందో ఎప్పుడు పిల్లలూ ఆయనా వస్తారో' పాతికోసారి నిట్టూర్చి ఇరవయ్యవసారి గడియారం వంక చూసింది.




మధ్యాహ్నం మామూలుగా అన్నపూర్ణ పడుకుంటే ఎవరో తలుపు తట్టారు. "ఎవరబ్బా" అనుకుంటూ విసుక్కుంటూ "వస్తున్నా" అని తలుపు తీసింది. ఎదురుగా పోస్టుమేన్. 'ఏమిటి చిద్విలాసంగా నవ్వుతున్నాడు!' "అమ్మా! మీకు ఎం. ఓ. ఉంది పత్రికల వాళ్ళ దగ్గర్నుంచి" "ఏవిటి జోకా" అనుమానంగా వాడికేసి చూసింది. ఎందుకంటే వాడేగా పత్రికవాళ్ళు తిప్పి పంపించిన కథలన్నీ పదిలంగా అందించింది ఏదో ఒక్క కథ తప్ప. అన్నపూర్ణ అనుమానాన్ని అర్థం చేసుకున్నాడో ఏవిటో పోస్టుమేన్ "ఇక్కడ సంతకం పెట్టండి" అంటూ ఓ ఫారమ్ అందించాడు. దాంట్లో "అమ్మా! మీ కథకి ప్రతిఫలంగా, 75 రూపాయలు పంపిస్తున్నాం" అని వుంది.

అన్నపూర్ణకి సంతకం పెట్టి డబ్బు తీసుకుంటుంటే చేతులు వణికాయి. అవును మరి. అది తన మొట్టమొదటి సంపాదన. అసలు పంపించరనే అనుకుంది తను. అన్ని కథలకి పంపించరేమో పేరున్న రచయితల కథలకి తప్ప అని అనుకుంది. "నీకు కాగితాలు తేవడంతో నా పని అవుతోంది. కాగితాలు దండగ. ఇక కథలు రాయకు తల్లీ." ఓ కథ తిరిగొచ్చిందని రావు ఎగతాళి చేసాడు. ఇప్పుడు చెప్పాలి ఆయనకి! పోస్టుమేన్‌కి ఓ రూపాయిచ్చి తలుపేసుకుని లోపలికి వచ్చింది అన్నపూర్ణ.

సాయంకాలం పిల్లలు, రావు తిరిగొచ్చేటప్పటికి అన్నపూర్ణ విలాసంగా నవ్వుతూ స్వీటు, హాటు వున్న ప్లేటు అందించింది వాళ్ళకి. "ఏవిటి విశేషం. అమ్మ పుట్టిన రోజా" అనుమానం వచ్చింది పిల్లలకి. అదే అడిగారు. "కాదర్రా. కొత్త మ్యాగజైన్ వచ్చిందిగా, దాంట్లో రాసిన వంట మన మీద ప్రయోగం చేసుకుంటుంది మీ అమ్మ. వాసన చూసి మంచివీళ్ళు రెడీగా పెట్టుకుని

మరీ తినండి'' రావు జోక్ చేసాడు. అయినా అన్నపూర్ణ నవ్వుతూనే వుంది. రావుకు ఆశ్చర్యం వేసింది. "పిల్లలూ రెడీయా, వన్, టూ'' పిల్లలూ, రావూ ఒకేసారి నోట్లో పెట్టుకున్నారు. "ఓర్నీ ఇది మినపసున్నా, రంగు, వాసన, చూసి ఏదో అనుకున్నా'' అని రావూ, "నాన్నగారూ, ఇది పులిహోరండీ'' అని పిల్లలూ అరిచారు. "ఏడిసార్లెండి'' అని పిల్లల్ని కసిరి "ఇదిగో ఈ వేళ మీరేవన్నా నాకు కోపం రావడం అసాధ్యం.'' అంటూ కాఫీ తీసుకురావడానికి లోపలికి వెళ్ళింది అన్నపూర్ణ.

"ఇదిగో నిన్నే, ఏవిటి విశేషం? కొంపతీసి మళ్ళీ కథ పడుతోందని తెలిసిందా ఏవిటీ?'' రావు అనుమానంగా అడిగాడు. "హుఁ పేపర్లు కొనడానికే దెప్పేరఁగా ఇంక చూడండి పది కధలకి సరిపడ పేపర్లు నేనే కొనుక్కుంటా అందుకే అంటారు నారు పోసినవాడు నీరు పొయ్యడా అని.'' అన్నపూర్ణ చేతిలో రిపరిప లాడుతున్న 75 రూపాయలని చూసి రావు "అదా నీ సంతోషానికి కారణం. ఏదీ అవి ఇలా ఇయ్యి, నేను తేసూ నీకు ఎన్ని కావాలంటే అన్ని కాగితాలు'' అన్నాడు.

"ఆఁ ఆఁ ప్లేటు ఫిరాయించకండి.''

"అందుకే ఆడదానికి ఆర్థిక స్వాతంత్ర్యం వద్దంటారు. 75 రూపాయలకే ఎంత పోజిస్తున్నావో. నేను ఇలాంటి 75 లు ఎన్ని సంపాదిస్తున్నానో. ఎన్నడైనా పోజు కొట్టేనా? ఆ డబ్బులిలా ఇయ్యి నేనే ఏదైనా ఆలోచించి చేస్తా.''

"ఆఁ ఆలోచించి ఇంటికి 75 రూపాయలతో వక్కపొడి పొట్లాలు కొనుక్కొస్తారు. మనకవే జీవితంలో అత్యంత ప్రధానమైన పదార్థం కాబట్టి. మీకెందుకు లెండి. నేనే ఏదో ఆలోచించి చేస్తా.'' అంది అన్నపూర్ణ. "సరే నీ ఇష్టం'' రావు పిల్లలతో బయటికి తిరగడానికి వెళ్ళిపోయాడు. అన్నపూర్ణకి ఒకటే ఆలోచన. కూర వేయిస్తుంటే గుర్తొచ్చింది. పోనీ స్టీలు బూర్లె మూకుడు కొనుక్కుంటే. వెధవ ఇనప మూకుడుతో చచ్చే చావుగా వుంది. ఎంత తోమినా సరిగ్గా వదిలి చావదు. కానీ వంటింటి సామాను కొంటే "మీ ఆడవాళ్ళ ఆలోచనలు వంట గదికే అంకితం'' అని ఆయన ఏడిపిస్తారేమో.

ఇంతలో పక్కింటి మంజు వచ్చింది. అంతా విని "ఏవిటి పూర్ణా దీనికింత ఆలోచన. ఓ చీర కొనెయ్. రేపు నేనూ వస్తా బజారుకి కావాలంటే.'' అన్నపూర్ణ విసుక్కుంది. 'దీని ఏేస్టు తగలడ దీనికి చీరలు, నగలు తప్ప ఏవీ అక్కరలేదు.' వంటంతా అయ్యాక ఓసారి డబ్బులు చూసుకుందామని బీరువా తెరిచింది. "అయ్యో ఎక్కడా లేవే. ఏమయ్యాయి?'' చీరలన్నీ పోగేసింది. తరువాత గుర్తొచ్చింది. ఇందాక ఓసారి తీసి సూట్‌కేసులో పెట్టినట్లు.

ఒకటో తారీఖు వచ్చింది. అన్నపూర్ణకి ఇంకా ఆలోచన తెగలేదు. సాయంత్రం రావు వస్తూనే "ఇదిగో పూర్ణా జీతం. బీరువాలో పెట్టు'' అంటూ ఇచ్చాడు. అప్పుడు తెలిసింది పూర్ణకి తన డబ్బును ఏం చేయాలో. తనెంత కుళ్ళుగా ఆలోచించింది. నెలంతా కష్టపడి సంపాదించినదంతా ఆయన తనకిస్తారు. తనో? 'తన' డబ్బును దాచి దాచి ఏం చేయాలో ఇంకా సిగ్గులేకుండా ఆలోచిస్తోంది. "ఏవండీ'' కాఫీ తీసుకుని వచ్చిన భార్యని చూసి "ఏవిటీ'' అన్నాడు రావు. "ఇదిగోనండి డబ్బు. మీరే ఏదైనా చెయ్యండి. నాకసలు బుద్ధిలేదు. ఇన్నాళ్ళు నా డబ్బు నా డబ్బు అనుకుంటూ దాచుకున్నాను.'' రావు నవ్వుకున్నాడు. "అయితే తయారవు. పిల్లలూ, మనం కలిసి హాయిగా అలా తిరిగి, సినిమా చూసి హోటల్లో భోంచేసి వద్దాం.'' అన్నపూర్ణ ఆనందంగా కదిలింది. □




## కొత్త వస్తువులు

లాక్మేవారి రెండు నూత్న సౌందర్య సాధనాలు

సౌందర్య సాధనాల తయారీలో పేరు గాంచిన లాక్మే లిమిటెడ్‌వారు వారి పరిశోధనా విభాగంలోను, వినియోగదార్లతోను జరిపిన అనేక ప్రయోగాల అనంతరం రెండు సౌందర్య సాధనాలను ఉత్పత్తి చేస్తున్నారు. అవి సాఫ్ట్ అండ్ సిల్కీ హెయిర్ రిమూవింగ్ లోషన్, లాక్మే కాస్మెటిక్ సబ్బు.

హెయిర్ రిమూవర్ లోషన్ అరచేతిలో వేసుకుని మునివేళ్ళతో రాసుకుంటే చాలనీ ఉపయోగించడం ఎంతో సులభమైన ఈ లోషన్ బేబీ ఆయిల్ కలిగివుండడం విశేషమనీ ఇది చర్మాన్ని మృదువుగా, సున్నితంగా వుంచుతుందనీ తయారీదారులు చెబుతున్నారు.

లాక్మే కాస్మెటిక్ సబ్బులో-ప్రత్యేకమైన చర్మాన్ని మృదువుగా వుంచే నూనెలు వున్నాయనీ, ఇవి చర్మ సౌందర్యాన్ని ఇనుమడింపజేస్తూ మృదువుగా మిలమిలలాడేలా వుంచుతాయనీ ఈ సబ్బు ఆకృతి కూడా సులభంగా ఉపయోగించేందుకు వీలుగా వుంటుందనీ లాక్మే సంస్థ తెలియజెబుతున్నది. పరిమళాలీనే లేత గులాబి రంగులోని ఈ సబ్బు వెల రూ. 5-50.




### బేబి సింధు

'పువ్వుపుట్టగానే పరిమళిస్తుందన్న సామెత బేబి సింధుపట్ల అక్షరాల నిజమయింది. తన మూడవ ఏటనే' 'ఆరోగ్యకరమైన అందాల బాల'గా బహుమతి అందుకున్న సింధు ఆ మరు సంవత్సరమే పాటల పోటీలో షీల్డు అందుకుని, ఐదవ ఏట చిత్రలేఖనంలోనూ మొదటి బహుమతి పొందింది. విచిత్ర వేషధారణ, మంచి జ్ఞాపకశక్తి పోటీవరకు అన్నిటా బహుమతులు పొందుతున్న సింధు చదువులో కూడా మొదటి స్థానంలో వుండడం విశేషం.

